01ATP22F_01ATP22F.qxd 22-06-2024 PM 10:31 Page 1




# అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఆదివారం 23 జూన్ 2024 — పేజీలు : 04


# స్పీకర్, హోం మంత్రిని కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి



స్పీకర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



హోం మంత్రి వంగల పూడి అనితను సన్మానిస్తున్న దృశ్యం

- అసెంబ్లీ సమావేశాల అనంతరం స్పీకర్‌ని కలిసి ఘనంగా సన్మానం
- హోం మంత్రి వంగలపూడి అనితతో మర్యాద పూర్వక భేటీ
- నియోజకవర్గంలో పలు అంశాల గురించి చర్చ

**అనంతపురం అర్బన్, జూన్ 22 ప్రభాతవార్త**

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ విజయవాడలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి వంగల పూడి అనితని కలిశారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఆయన స్పీకర్‌ని కలిసి ఘనంగా సత్కరించారు. అన్న ఎన్టీఆర్ పిలుపును అందుకుని రాజకీయాల్లోకి అయ్యన్న, అతిచిన్న వయస్సులోనే శాసనసభకు వచ్చారని ఈ సందర్భంగా దగ్గుపాటి అన్నారు. సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఎమ్మెల్యేగా, ఎంపిగా మంత్రిగా ఇలా ఎన్నో పదవులు చేపట్టారని, పార్టీ ఏ ఆదేశాలిచ్చినా, అవకాశమిచ్చినా సద్వినియోగం చేసుకున్నారన్నారు. అయ్యన్న పాత్రుడు రాజకీయ ప్రయాణం మాలాంటి వారికి స్ఫూర్తిదాయకమన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 16వ శాసనసభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందదన్నారు. అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో అసెంబ్లీలో ప్రజా సమస్యలపై హుందాతనమైన చర్చలు, పరిష్కారాలు ఉంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు హోం మంత్రి వంగలపూడి అనితను దగ్గుపాటి కలిశారు. ఆమెతో మర్యాద పూర్వక భేటీ అనంతరం ఘనంగా సత్కరించారు. జిల్లా కేంద్రం కావడంతో నియోజకవర్గంలోని అంశాలు గురించి ఆరా తీశారు. మహిళ పోలీస్ స్టేషన్‌తోపాటు శాంతి భద్రతల అంశం గురించి కూడా చర్చించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి నేరుగా తీసుకురావచ్చని అనిత అన్నారు. ఈ సందర్భంగా దగ్గుపాటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదవుల కేటాయింపు చూస్తే ఆ పదవులకే ఒక కొత్త కళ వచ్చినట్టుందని ఆయన అభిప్రాయపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో కేవలం పేరుకే మంత్రులు ఇతర పదవులు ఉండేవని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# డయేరియాతో ఒక్కరూ బాధపడకుండా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

**అనంతపురం కలెక్టరేట్, జూన్ 22 ప్రభాతవార్త**

జిల్లాలో డయేరియాతో ఏ ఒక్కరూ బాధపడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డయేరియాపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డయేరియా అధికారులు అప్రమత్తంగా వుండాలన్నారు. జూలై 1 నుండి ఆగస్టు 31వతేదీ వరకు డయేరియా ప్రభావం, ముందస్తు జాగ్రత్తలు చేపట్టాల్సిన చర్యలపై స్టాఫ్ డయేరియా క్యాంపెయిన్ చేపట్టాలన్నారు. పిల్లలకు డయేరియా సోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిఎంహెచ్ఓ, డిసిహెచ్ఎస్‌లు నీటి పరిశుభ్రత, నీటి కాలుష్యం, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా స్థాయిలో మున్సిపల్ కమీషనర్, జిల్లా పరిషత్ సిఇఓ, డిఎంహెచ్ఓ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ, డిసిహెచ్ఎస్, ఇతర జిల్లా అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. నీటి కాలుష్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మెడికల్ అధికారులు డయేరియా గురించి అవగాహన కలిగేలా జాగ్రత్త చర్యలు గురించి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని డిఐఓను ఆదేశించారు. పిహెచ్‌సి, సిహెచ్‌సిల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్ల స్టాక్ అందుబాటులో వుంచేలా చెక్ చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని వాటర్ ట్యాంకులపై మూత వేసేలా చూడాలన్నారు. ఐసిడిఎస్ అధికారులు వారి పరిధిలోని అంగన్‌వాడి కేంద్రాలను శుభ్రంగా వుంచుకోవాలన్నారు. మంచినీటి సౌకర్యం కల్పన చూసుకోవాలని సూచించారు. డయేరియా సోకకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మెడికల్ అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ కాచిన నీటిని తాగే విధంగా విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమీషనర్ మేఘస్వరూప్, జిల్లా పరిషత్ సిఇఓ వైఖోమ్‌నిదియాదేవి, డిపిఓ ప్రభాకర్‌రావు, డిఎంహెచ్ఓ డాక్టర్ ఈబి.దేవి, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పివిఎస్ఎన్ మూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఎహసాన్‌బాషా, జిల్లా మలేరియా అధికారి ఓబులు, డిపిఓ యుగంధర్, పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ నాగరాజారావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్, డిటిడబ్ల్యుఓ రామాంజినేయులు, మైన్స్ డిడి నాగయ్య, వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయా శాఖల మండల, క్షేత్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కేంద్రం నిర్వహించిన ఆర్థిక మంత్రుల సమావేశానికి హాజరైన రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

- దేశ ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌తో పలు విషయాలపై చర్చ



దేశ ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్‌తో చర్చిస్తున్న రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**ఉరవకొండ, జూన్ 22 ప్రభాతవార్త**

సార్వత్రిక ఎన్నికల తరువాత కేంద్ర ప్రభుత్వం 2024 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి ముందు రాష్ట్రాల అభి ప్రాయాలు, వినతులను స్వీకరించడానికిగాను దేశ రాజధాని ఢిల్లీలో భారత్ మండపంలో తొలిసారి శనివారం నిర్వహించిన రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ హాజరయ్యారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో భారతదేశం నేడు ప్రపంచంలో అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతోందన్నారు. విజనరీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి సాధించడానికి బడ్జెట్‌లో సముచిత కేటాయింపులు చేయాలని కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇతర రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కాసేపు ముచ్చటించారు.

# నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించండి

- మంత్రులను కోరిన ఎమ్మెల్యే ఎంఎస్.రాజు



నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని కలిసిన ఎమ్మెల్యే ఎంఎస్.రాజు



వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

**మడకశిర టౌన్, జూన్ 22 ప్రభాతవార్త**

మాజీ శాసన మండలి సభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి మడకశిర శాసన సభ్యులు ఎంఎస్.రాజు మడకశిర నియోజకవర్గానికి అభివృద్ధి పథంలో నడిపించాలన్న ఆశయంలో భాగంగా ఎంఎస్.రాజు శాసనసభ సమావేశాల అనంతరం రాష్ట్ర సచివాలయంలోని 5వ బ్లాకులో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కలిసి మడకశిర ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తయ్యేందుకు చర్యలు చేపడుతూ, నూతనంగా నిర్మిస్తున్న భవనంలో ఇంకా కల్పించాల్సిన మౌలిక వసతులను, అదనపు సిబ్బందిని నియమించడం వాటిని వెంటనే చేపట్టాలని, అగళి, గుండుమల ప్రాథమిక వైద్య కేంద్రాలను 24 గంటలపాటు పని చేసే విధంగా రౌండ్ ద క్లాక్ పిహెచ్‌సిలుగా అప్ గ్రేడ్ చేయాలని విన్నవించడం జరిగింది. బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ కలిసి గుండుమల ఎంజెపిబిసి గురుకుల పాఠశాల బాలురు, గుడిబండ ఎంజెపిబిసి గురుకుల పాఠశాల బాలికలలో 5వ తరగతి నుంచి 8వ తరగతుల వరకు ఉన్న విద్యార్థుల సంఖ్యకు అదనంగా 10శాతం సీట్లను పొడిగించి ఈ ప్రాంత పేద విద్యార్థుల భవిష్యత్తుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నీరు పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కలిసి మడకశిర నియోజకవర్గంలో హంద్రీనీవా కాలువ విస్తరణ, బైపాస్ కెనాల్, అన్ని చెరువులకు నీరందేలా సత్వర చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎలతోపాటు తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస మూర్తి పాల్గొన్నారు.





ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన చింతకాయల అయ్యన్న పాత్రుడును శనివారం విజయవాడలో గౌరవపూర్వకంగా కలిసి సత్కరించిన మాజీమంత్రి రాప్తాడు ఎంఎల్ఏ పరిటాల సునీతమ్మ. అదేవిధంగా వెలగపూడిలోని శాసనసభ ప్రాంగణంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధతో మాజీ మంత్రి పరిటాల సునీత ముచ్చటించిన దృశ్యాలు

# పచ్చదనం అభివృద్ధితోనే పర్యావరణ సమతుల్యం

- సమగ్ర శిక్ష ఏపిసి వైకోమ్‌నిదియాదేవి

**అనంతపురం న్యూటౌన్, జూన్ 22 ప్రభాతవార్త**

విరివిగా మొక్కలు నాటడం ద్వారా పచ్చదనం అభివృద్ధి చెంది పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త వై.కోమ్ నిదియాదేవి అభిప్రాయ పడ్డారు. స్థానిక సమగ్ర శిక్ష కార్యాలయంలో ఏపిసి ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో లాంటి కరువు జిల్లాలో విరివిగా మొక్కలు పెంచడమే సమస్యకు పరిష్కారం అన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రాంగణాల్లో మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల్లో చెట్ల పెంపకం పట్ల చైతన్యాన్ని ఆసక్తిని పెంపొందించాలన్నారు. నీడనిచ్చి పచ్చదనాన్ని పెంపొందించే మొక్కలతోపాటు పశుపక్ష్యాదులకు ఫలాలను అందించే వృక్షాలను కూడా నాటాలన్నారు. సమగ్ర శిక్ష కార్యాలయ ప్రాంగణంలో శనివారం 50కిపైగా మొక్కలను నాటారు. చింత, వేప, సీతాఫలం, నేరేడు, కానుగ తదితర 50కి పైగా మొక్కలు నాటి నాటికి నీటిని అందించారు. ఈ కార్యక్రమంలో ఏపిసితోపాటు సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధజకారులు, ఇంజనీరింగ్ అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న దృశ్యం




# పదవీ విరమణ శుభాకాంక్షలు

నేడు పదవీ విరమణ గావిస్తున్న శ్రీ రామానాయక్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు, APTF 1938 గారికి పదవీవిరమణ శుభాకాంక్షలు తెలుపుతూ... ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో సాగిపోవాలని మనసారా కోరుకుంటూ....

స్థలం : అంబేద్కర్ భవన్, అనంతపురము

రామానాయక్
అనంతపురం జిల్లా అధ్యక్షుడు APTF 1938

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 , అనంతపురం జిల్లా.



ఎం.వెంకటసుబ్బయ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు
వి.మహమ్మద్ రఫీక్ రాష్ట్ర కార్యదర్శి
పి.వి.ప్రసాద్ జిల్లా గౌరవాధ్యక్షుడు
ఆర్.శ్రీనివాసనాయక్ జిల్లా ప్రధానకార్యదర్శి
సత్యప్రకాష్ ఐఫియా కమిటి సభ్యులు
పోతలయ్య జిల్లా సహాధ్యక్షుడు
డి.అంజనేయులునాయక్ జిల్లా అదనపు కార్యదర్శి
కె.కులశేఖర్‌రెడ్డి రాష్ట్ర కౌన్సిలర్
కె.వెంకటరెడ్డి రాష్ట్ర కౌన్సిలర్
జి.రవీంద్ర రాష్ట్ర కౌన్సిలర్
పి.శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ జిల్లా కార్యవర్గ సభ్యుడు
అశోక్‌నాయక్,అకడమిక్ కమిటి చైర్మన్, అనంతపురం
పి.వజీర్‌బాష జిల్లా ఉపాధ్యక్షుడు
ఎం.మద్దిలేటప్ప జిల్లా కార్యదర్శి
హుస్సేన్,అనంతపురం నగర ప్రధాన కార్యదర్శి
బి.నారాయణ నాయక్ అనంతపురం నగర అధ్యక్షుడు


# రెవెన్యూ ఉద్యోగులు విధుల్లో అలసత్వం వద్దు

- అభిషేక్ కుమార్ జాయింట్ కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్

**శ్రీసత్యసాయి జిల్లా జూన్ 22 ప్రభాతవార్త ప్రతినిధి**

రెవెన్యూ ఉద్యోగులు తమ విధులలో అలసత్వం చేయరాదని రెవెన్యూ వారి సేవలు అభినందనీయమని ఇదే స్ఫూర్తితో పని చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని ముఖ్య విభాగాల ఉద్యోగ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారినికి కృషి చేయాలన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో జిల్లా యంత్రాంగం మంతా కలసి ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి పనిచేసిన అందరికి అభినందనలని జెసి పేర్కొన్నారు. ముఖ్యంగా కలెక్టరేట్లోని పరిపాలన విభాగం ఎన్నికల విభాగం చక్కగా పనిచేశారన్నిరు. ఇదే స్ఫూర్తితో ఇకపై కూడా పనిచేయాలన్నారు. సబ్ కలెక్టర్ మొదలుకొని డివిజనల్ అధికారులు తాహసిల్దార్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ దృశ్య మూడు నెలల కాలం అదే పనిపై పనిచేశామని ఇక పెండింగ్లో ఉన్న ఫైళ్లను పరిపాలనపరంగా ప్రత్యేక దృష్టి సాధించి వాటిని పరిష్కరించాలని జెసి అధికారులను ఆదేశించారు. స్పందనలో వచ్చిన అర్జీలు భూసేకరణ సనులు వివాసితతులకు పరిహారం తదితరు అంశాలపై సమీక్షించారు. కలెక్టరేట్లో సిబ్బంది కొరత ఉందని ఉద్యోగులు జెసి దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సిబ్బంది కొరత సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రామాంజనేయరెడ్డి, శాంతి భద్రతలు విభాగం సూపరిండెంట్ వసుంధర ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ మొయినుద్దీనన తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిని కడతేర్చిన కసాయి తండ్రి

**నార్పల రూరల్, జూన్ 22 ప్రభాతవార్త**

నార్పల మండల కేంద్రంలో పావని (6) అనే ఆరేళ్ల చిన్నారిని కసాయి తండ్రి హత్య చేసి కొత్త బస్టాండ్ సమీపంలోని బావిలో పడవేసిన ఘటన జిల్లాలో సంచలనంగా మారింది. జిల్లా ఎస్పి గౌతమిశాలి నార్పలకు వచ్చి దర్యాప్తును స్వయంగా పర్యవేక్షించారు. పావనిని హత్య చేసింది అమ్మాయి తండ్రి గణేష్‌గా పోలీసు విచారణలో వెల్లడైంది. దీంతో గణేష్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా చిన్నారి తనకు పుట్టలేదని తన భార్య వివాహేతర సంబంధంతో ఈ చిన్నారి జన్మించినట్లు గణేష్ అనుమానం వ్యక్తం చేశాడు. రోజు రోజుకు అనుమానం పెను భూతమై పావనిని హత్య చేసినట్లు తెలుస్తోంది. తన భార్యకు ఇతరులతో వివాహేతర సంబంధం వుందని గణేష్ పోలీసుల విచారణలో తెలిపాడు. పావనిని స్కూల్‌లో చేర్పించే దగ్గర నుండి ప్రతి విషయంలో తన భార్య పెత్తనాన్ని సహించలేకపోయానని గణేష్ పోలీసులకు వివరించాడు.



హత్యకు గురైన చిన్నారి పావని


వార్త జాతీయ దినపత్రికకు

# రిపోర్టర్స్ కావలెను

అశేష పాఠకుల ఆదరాభిమానాలందుకున్న వార్త జాతీయ దినపత్రికకు ఈ క్రింది సెంటర్లలో రిపోర్టర్లు కావలెను.

పెద్దపప్పూరు, వజ్రకరూరు, బొమ్మనహాళ్, గుంతకల్ టౌన్, గార్లదిన్నె, నార్పల, సోమందేపల్లి, పెనుకొండ మరియు పరిగి.

: అర్హతలు : డిగ్రీ ఉత్తీర్ణులై, స్థానికులై ఉండాలి. వయస్సు 40 సం॥ల లోపు

ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా & 3 పాస్‌పోర్టు సైజు ఫోటోలతో 27-06-2024న ఉదయం 10 గం॥లకు ఈ క్రింది చిరునామాలో హాజరుకాగలరు

వార్త ప్రాంతీయ కార్యాలయం
డిసిఎంఎస్ కాంప్లెక్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రక్కన, అనంతపురం.

: బ్యూరో : 9848997171
: బ్రాంచ్ మేనేజర్ : 9848996402

# వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

## -కమీషనర్ శ్రీనివాసులు



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**గుత్తి, జూన్ 22 ప్రభాతవార్త**

రానున్న వర్షాకాలం దృష్ట్యా వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో అమెనిటీస్ సెక్రటరీలు, శానిటరీ కార్యదర్శులు, ఆరోగ్య కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా కాలనీల్లో మెరుగైన పారిశుద్ధ్యం నిర్వహించాలన్నారు. డెంగ్యూ, మలేరియా, డయేరియా ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కమీషనర్ తెలిపారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో బాలుడు దుర్మరణం



మృతి చెందిన బాలుడు, గాయపడిన తండ్రి

**గుత్తి, జూన్ 22 ప్రభాతవార్త**

గుత్తి పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విష్ణు (5) అనే బాలుడు దుర్మరణం పాలయ్యాడు. తమిళనాడు రాష్ట్రం ధర్మపురికి చెందిన కార్తీక్, మోహన్, సత్య, విష్ణులు మోటర్‌సైకిల్‌పై హైదరాబాద్‌కు వెళుతున్నారు. కొత్తపేట ఫ్లైఓవర్ దాటగానే మోటర్‌సైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను వేగంగా ఢీ కొంది. ఈ సంఘటనలో బాలుడు అక్కడకక్కడే మృతి చెందగా గాయపడిన ముగ్గురిని స్థానిక చికిత్స అనంతరం అనంతపురంకు తరలించారు. ఈ సంఘటనపై ఎస్ఐ నబీరసూల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ

**గుత్తి, జూన్ 22 ప్రభాతవార్త**



విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మండలంలోని బేతాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, తదితర విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. ప్రొద్దుటూరుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి తన కుమారుడు చంద్రగణేష్ పుట్టినరోజును పురస్కరించుకుని దాదాపు 180 మంది విద్యార్థులకు విద్యాసామాగ్రిని ఆయన పంపిణీ చేశారు. ఈ విద్యాసామాగ్రిని సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం మహాలక్ష్మీ సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు ఆంజనేయులు, ఎంపిటిసి ధనుంజయ, ఉపాధ్యాయులు ఓబులపతి, శివప్రసాద్, సుజాత, రామకృష్ణయ్య, రత్నకుమారి, మాదన్న, నరేంద్రనాథ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# స్టాక్ పాయింట్ గోడౌన్ తనిఖీ



గోదామును తనిఖీ చేస్తున్న దృశ్యం

**గుత్తి, జూన్ 22 ప్రభాతవార్త**

పట్టణంలోని పౌరసరఫరాలశాఖ స్టాక్ పాయింట్ గోడౌన్‌ను శనివారం గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. నిత్యావసరవస్తువుల తూకాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భారతి, సిపిడిఓ ఢిల్లీశ్వరి, సిఎస్‌డిటి సూర్యనారాయణ, స్టాకిస్టులు మహబూబ్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయం ముందు ఆర్ఎస్‌వైఎఫ్ ధర్నా

**-ఇంటర్ విద్యార్థులకు మధ్యాన్న భోజనం అమలు చేయాలని డిమాండ్**

**-పట్టణంలో వందలాది మంది విద్యార్థినులతో భారీ నిరసన ప్రదర్శన**

**ఉరవకొండ, జూన్ 22 ప్రభాతవార్త**



విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు

ఇంటర్ విద్యార్థులకు గతంలో మాదిరిగా మధ్యాన్న భోజన పథకాన్ని అమలు చేయాలన్న డిమాండ్‌తో ఆర్ఎస్‌వైఎఫ్ శనివారం ఉరవకొండ మండల తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించింది. స్థానిక ఎస్.కె.ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి ఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు విద్యార్థినులతో పట్టణంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కో కన్వీనర్ భీమేష్, కన్వీనర్ చిరంజీవి, జిల్లా నాయకులు అనీల్ తదితరులు మాట్లాడుతూ గత 2018లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థుల కోసం ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాన్న భోజన పథకాన్ని అమలు చేసిందన్నారు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పథకాన్ని కొనసాగించకుండా నిర్వీయం చేయడంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతులు, రైతు కూలీ కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. రాష్ట్రంలో మళ్లీ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది కనుక గతంలో తరహాలోనే పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని మధ్యాన్న భోజన పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. ధర్నా అనంతరం ఆర్ఐ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు.



ధర్నా అనంతరం ఆర్ఐ రామకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

# మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసిని బిజేపి నాయకులు



సత్యకుమార్ యాదవ్‌ను సన్మానిస్తున్న బిజేపి నాయకులు

**మడకశిర జూన్ 22 ప్రభాతవార్త;**

భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య విద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను శనివారం విజయవాడలోని ఆయన నివాసంలో బిజేపి కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంఛార్జ్ ఎస్. చంద్రశేఖర్ బిజేపి జిల్లా కార్యదర్శి మేడం వరప్రసాద్, అసెంబ్లీ కన్వీనర్ ఆదర్శ్ కుమార్, పట్టణ మాజీ అధ్యక్షులు వి.శంకర్‌లు కలసి మంత్రిని శాలువాలతో సత్కరించారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ మడకశిర ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని ప్రధానంగా సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని 100 పడకల నూతన భవనాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్ప ందించారు. త్వరలో మడకశిర పర్యటనకు వచ్చి అక్కడి పనులను పర్యవేక్షించి అక్కడి సమస్యలను పరిష్కారం దిశగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారని చంద్రశేఖర్ తెలిపారు.

# గ్రామాల్లో కీటక జనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు

**-దోమల పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలని పిలుపు**

**ఉరవకొండ, జూన్ 22 ప్రభాతవార్త**



నెరమెట్ల గ్రామంలో మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఒాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మాలేరియా నివారణ మాసోత్స వాల్లో భాగంగా శనివారం మండల పరిధిలోని నెరమెట్ల, నింబగల్లు, మోపిడి, చిన్నముష్టూరు గ్రామంలో కీటక జనిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు జరిగాయి. ఈ సందర్భంగా పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగ రంగయ్య, హెల్త్ ఎద్యుకేటర్ ఎస్.యండి.షఫీ మాట్లాడుతూ ఇళ్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమకాటువల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు వస్తాయని వారానికి ఒకరోజు తప్పక డ్రై డే పాటించాలన్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, ఆరోగ్య కార్యకర్త వెంకటేష్, సీఓ భగవాన్‌దాస్, ఏఎన్‌ఎంలు సలీమా, లలిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగిరెడ్డిపల్లిలో టిడిపి శ్రేణులు ప్రత్యేకపూజలు



టెంకాయలు కొడుతున్న దృశ్యం

**లేపాక్షి, జూన్ 22 ప్రభాతవార్త**

లేపాక్షి మండల (కర్ణాటక) సరిహద్దుకు సమీపంలోని జరిగిరెడ్డిపల్లి శ్రీఆంజనేయస్వామి ఆలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. రాష్ట్రంలో పార్టీ అఖండ విజయం సాధించడం పట్ల నాయకులు 101 టెంకాయలు కొట్టి శ్రీఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ జయప్ప మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి అఖండ విజయం సాధించిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తనకున్న రాజకీయ అనుభవంతో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలుతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపడతారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మానేపల్లి మాజీ సర్పంచు నారాయణ, మాజీ ఎంపిటిసి రామచంద్ర, పాపిరెడ్డి, హనుమంతరాయప్ప, కిష్టప్ప, హెచ్ఆర్ గంగాధరప్ప, విజయ్‌కుమార్, చిన్నహనుమంతు, రఘు, రామాంజి, అశ్వర్థ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఎన్డీఏ కూటమి మంత్రి సవితమ్మ పర్యటనను విజయవంతం చేయండి

**గోరంట్ల జూన్ 22 ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి,జపసేన నాయకులు

నేడు ఆదివారం 23వ తేదీ ఎన్డీఏ కూటమి పెనుకింద నియోజకవర్గ ఎమ్మెల్యే రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మరియు చేనేత శాఖమంత్రి సవితమ్మ మొట్టమొదటి సరారిగా నియోజక వర్గానికి రానున్న సందర్భంగా కర్ణాటక సరిహద్దు టోల్ గేట్ మీదుగా కొడికొండ చెక్ పోస్టు పాలసముద్రం మీదుగా పెద్దఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్న సందర్భంగా భారతీయజనతా పార్టీ మరియు జనసేన నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి,జనసేన మండల కన్వీనర్ సంతోష్,కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్‌రెడ్డి,మేదర శ్రీనివాసులు,చిలమత్తురు వెంకటేష్ వెంకటాచలం,బోయ లక్ష్మీనారాయణ,హరికృష్ణ,వీర మహిళా కావేరి,లక్ష్మీనరసు,కే శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు.

# డా శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించండి

**- పార్టీ శ్రేణులకు బిజెపి నాయకులు సూచన**

**ధర్మవరం రూరల్, జూన్ 22 ప్రభాతవార్త**

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని వార్డులలో 23 తేదీన ఆదివారం డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ 71వ జయంతి వేడుకలు పార్టీ కార్యాలయంతోపాటు అన్ని వార్డులలో ఘనంగా నిర్వహజంచాలని ఆ పార్టీ నాయకులు తెలియజేశారు. ఈ సందర్భంగా బిజెపి పార్టీ కార్యాలయంలో నాయకులు మాట్లాడుతూ.. బిజెపి పార్టీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ధర్మవరం పట్టణంలో ప్రతి వార్డులోనూ డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటాన్ని ఉంచి ఆయన చేసిన సేవలను త్యాగాన్ని స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించాలని ఆపార్టీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జింక చంద్రశేఖర్, సాకే ఓబులేసు, డోల రాజారెడ్డి, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# హావేరి జిల్లాలో విజృంభిస్తున్న డెంగ్యూ జ్వరాలు

**హావేరి,జూన్22,ప్రభాతవార్త ప్రతినిధి**

హావేరి జిల్లాలో ఇటీవల కురిసిన వానలకు పలుచోట్ల నీరు నిలబడిపోవటంతో డెంగ్యూ జ్వరాల కేసులు పెరిగిపోతున్నాయి.వీధుల్లోని కాలువల గుండా మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తం కావటంతో మురుగునీటివలన డెంగ్యూ దోమలు వ్యాపించి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి.శనివారం హావేరి నగర ఆరోగ్యశాఖ డెంగ్యూ దోమలకు వ్యతిరేకంగా ప్రజల్లో జాగృతి కలిగించేందుకు జిల్లా వ్యాప్తంగా అభియాన్ నిర్వహించింది.హావేరి పట్టణంలోనే 380డెంగ్యూ కేసులు నమోదు కావటంతో ప్రజలు భయపడుతున్నారు.స్థానిక సంస్థల అధికారుల నిర్లక్ష్యం పట్ల ప్రజలు ఆరోపిస్తున్నారు.మురుగుకాలువలు శుభ్రం చేసి నీటిపారుదల వ్యవస్థను మెరుగుపరచాలని వారు కోరుతున్నారు.

# చిక్కమగళూరు జిల్లా ముళ్లయ్యనగిరి ఎత్తినభుజ కొండలపై ట్రెక్కింగ్ నిషేధం

**చిక్కమగళూరు,జూన్22,ప్రభాతవార్త ప్రతినిధి**

చిక్కమగళూరుజిల్లాలో పర్యాటక ప్రాంతాలుగా పేరు మోసిన ముళ్లయ్యనగిరి, ఎత్తినభుజ ప్రాంతాల్లో ట్రెక్కింగ్‌ను నిషేధిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.శలవు రోజుల్లో ఈరెండు ప్రాంతాలకు పెద్దసంఖ్యలో పర్యాటకులు తరలిరావటంతో సమస్యలు వస్తున్నాయి.దీనికితోడు వర్షాలు జోరుగా కురుస్తుండటం కూడా మరో కారణం అయ్యింది.ఇటీవల ఉత్తరకాశిలో సంభవించిన ట్రెక్కింగ్ దార్ల దారుణమృతి ఉదంతంతో జాగ్రత్తలు పడిన జిల్లా యంత్రాంగం పై రెండు చోట్ల యువ పర్యాటకులు ట్రెక్కింగ్ చేయటాన్ని తాత్కాలికంగా నిషేధించింది,ఈ ఆదేశాలు అమలు చేయాల్సిన బాధ్యత ఆయా స్థానిక అధికారులపై ఉంటుందని జిల్లాధికారి తెలిపారు.

# వ్యవసాయశాఖలో 600మంది సిబ్బంది నియమిస్తున్నాం

## - ఎన్.చెలువరాయ స్వామి

**రామనగర,జూన్22,ప్రభాతవార్త ప్రతినిధి**



రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి ఎన్.చెలువరాయ స్వామి

కర్ణాటక రాష్ట్ర వ్యవసాయ శాఖలో పలు సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న 600 ఉద్యోగాలను కొత్తగా భర్తీ చేసేందుకు సర్కారు చర్యలు తీసుకుందని వ్యవసాయ శాఖ మంత్రి ఎన్.చెలువ రాయస్వామి చెప్పారు.ఆయన ఒక కార్యక్రమంలో మాట్లాడారు. అధికారులు ఉద్యోగులు కొత్త నియామకాలు జరుపుతామని తెలిపారు. 15 సంవత్సరాలుగా వ్యవసాయశాఖలో కొత్త ఉద్యోగుల నియామకాలు జరగలేదు.ఈసారి వీటిని భర్తీ చేయాలని సర్కారు సంకల్పించింది.రైతాంగానికి సహాయపడే వ్యవసాయ శాఖలో అధికారుల నియామకాలు చురుగ్గా జరుపుతామని తెలిపారు.

# పాఠశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న గుండుమల తిప్పేస్వామి

**గుండిబండ, జూన్ 22 ప్రభాతవార్త**



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గుండుమల తిప్పేస్వామి

మండల కేంద్రంలో నూతనంగా వర్ష సైనిక్ పాఠశాల ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మ ఆట్లాడుతూ.. మారు మూల ప్రాంతమైన గుడిబండ మండలం విద్యార్థులకు నాణ్యమైన విద్యను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు కరస్పాండెంట్ శ్రీనివాస్, డైరెక్టర్ ఇమ్రాన్ చూపుతున్న చొరవను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, జడ్పి టీసీలు భూతరాజు, నరసింహమూర్తి, లాయర్ శివకుమార్, దుర్గేష్, మైనార్టీ నాయకుడు షబ్బీర్, లక్ష్మీనరసప్ప, భీమరాజు, జనసేన నాయకులు మంజునాథ్, మాజీ ఎంపిటిసిలు భోజరాజు, క్రిష్టప్ప, పురుషోత్తం, వెంకటరమణ, మాస్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి విజయం చారిత్రాత్మకం

**-టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి**



శ్రీఆంజనేయస్వామి పూజల్లో పాల్గొన్న మాజీ ఎంఎల్‌సి

**అమరాపురం, జూన్ 22 ప్రభాతవార్త**

రాష్ట్రంలో టిడిపి విజయం సాధించడంతో మండలంలోని ఆలదపల్లి గ్రామంలో శనివారం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించడంతో పాటు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ విజయం చారిత్రాత్మకమన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అన్ని వైపులా అభివృద్ధి దశలో తీసుకెళ్లే సమర్థవంతమైన నాయకుడని కొనియాడారు. గత ఐదు సంవత్సరాలు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అదోగతి పాలైందన్నారు. అనంతరం స్వామివారికి విశేషపూజల్లో పాల్గొన్నారు. అదేవిధంగా డిజె కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గణేష్, మాజీ జెడ్‌పిటిసి నరసింహమూర్తి, శివరుద్రప్ప, మాజీ సర్పంచులు పాండురంగప్ప, చంద్రప్ప, ఈరన్న, కాంతరాజు, ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు జయకుమార్, మాజీ ఎంపిటిసిలు మంజునాథ్, నరసింహప్ప, ఎంజారప్ప, నరసింహమూర్తి, ముద్దన్న, గిరిరాజు, యువనాయకుడు మంజునాథ్, మారుతీప్రసాద్, దాదాపీర్, ఓంకార్‌స్వామి, శివరాజ్‌యాదవ్, శివకుమార్, తిప్పేస్వామి, రామిరెడ్డి, రవి, శ్రీనివాస్, మంజునాథ్, ఆలదపల్లి టిడిపి యూత్, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం



కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడిటీచర్లు

**లేపాక్షి, జూన్ 22 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన లేపాక్షిలోని అంగన్‌వాడి కేంద్రంలో లేపాక్షి, బిసలమానేపల్లి అంగన్‌వాడి కేంద్రాలకు చెందిన చిన్నారులకు సిపిడిఓ రమణమ్మ ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఓంకారంతో అక్షరాభ్యాసాన్ని ప్రారంభించారు. అనంతరం సిడిపిఓ రెడ్డి రమణమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాలకు చిన్నారులకు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అంగన్‌వాడి కార్యకర్తలు, సహాకులదేనన్నారు. ఏ చిన్నారి కూడా అంగన్‌వాడి బయట వుండరాదన్నారు. ప్రతి చిన్నారి అంగన్‌వాడి కేంద్రంలో చేర్పించే బాధ్యత అంగన్‌వాడి కార్యకర్తలతో పాటు తల్లిదండ్రులపై వుందన్నారు. 1వతరగతిలో చిన్నారులు పాఠశాలకు చేరే నాటికి అంగన్‌వాడి కేంద్రం నుండి వెళ్లాలన్నారు. ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ అంగన్‌వాడి కేంద్రాలతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, జయమ్మ, ఉపాధ్యాయురాలు ఈశ్వరమ్మ, చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్‌వాడి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో వైసీపి కార్యకర్త నివాళులు అర్పించిన ఎంపిపి కంభం చంద్రశేఖర్‌రెడ్డి

**బ్రహ్మసముద్రం జూన్ 22 ప్రభాతవార్త,**



నివాళులు అర్పిస్తున్న ఎంపిపి

మండలంలోని గొమ్మగానిపల్లి వంక తాండాకు చెందిన వైసీపి సీనియర్ కార్యకర్త రేషం గోవి ంద నాయక్ (60) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకొన్న ఎంపిపి కంభం చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ ఆదినారాయణరెడ్డి,వైస్ఎంపిపి వెంకటేష్‌నాయక్,అభిలాష్ తదితరులు గోవిందనాయక్ పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అండగావుంటానని చెప్పారు.

# అవధూత శ్రీశ్రీ ఎర్రితాత ఆరాధనోత్సవాలు

**బెలుగుప్ప, జూన్ 22 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో అవధూత శ్రీశ్రీ ఎర్రితాత ఆరాధనోత్సవాలు జూన్ 23, 24, 25 తేదీల్లో నిర్వహిస్తామని గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూన్ నెలలో 23న జేష్ట బహుళ ద్వితీయ ఆదివారం నాంది పూజ, గణపతి పూజ, గో పూజ, గంగపూజ, ధ్వజారోహణం, నంది వాహన సేవ, 24న శ్రీవారి ఉత్సవ విగ్రహం, 8 గంటలకు బిల్వ అర్చన, పల్లకి సేవ, సాయంత్రం శ్రీశ్రీ ఎర్రితాత ఉత్సవ విగ్రహాన్ని పుర వీధుల గుండా ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. 25న అభిషేకాలు, అర్చనలు, మంగళహారతులు, తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం చంద్రప్రభ అలంకరణతో అర్చనలు, ఉట్ల ఉ రుసు కూడా ఉంటుందని తెలిపారు. రాత్రి 8 గంటలకు భజన కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ ఉత్సవాలకు అధిక సంఖ్యలో కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొంటారని వారు తెలిపారు.

# మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

**గోరంట్ల జూన్ 22 ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

పెనుకొండ నియోజకవర్గానికి రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి చేనేత జౌళిశాఖ మంత్రి పెనుకొండ శాసనసభ్యురాలు ఎస్ సవితమ్మ మొట్టమొదటిసారిగా శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండకు నేడు వస్తున్నారని మండలంలోని టిడిపి,బిజెపి,జనసేన ఉమ్మడి ఎన్డీఏ కూటమి సభ్యులు ప్రతి ఒక్కరూ హాజరై పెద్దఎత్తున ఘన స్వాగతం పలకాలని మండల కన్వీనర్ సోమశేఖర్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా గోరంట్ల పట్టణంలోని టిడిపి పార్టీ కార్యలయంలో ఉమ్మడి పార్టీ నాయకుల సమావేశం నిర్వహించి ఉదయం 10 గంటలకు ప్రతి ఒక్కరూ తమ వాహనాలలో జిల్లా సరిహద్దులోని బాగేపల్లి టోల్ ప్లాజా వద్దకు హాజరుకావాలని తెలిపారు.అలాగే మంత్రితో కలిసి ర్యాలీగా పాలసముద్రం క్రాస్ మీదుగా పెనుకొండ పార్టీ కార్యలయం వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రతి ఒక్కరూ హాజరై ఘనస్వాగతం పలకాలని ఆయన కొరారు.ఈ సమావేశంలో పట్టణ కన్వీనర్ కక్కల రఘునాథ్‌రెడ్డి,పార్లమెంట్ కార్యదర్శి దేవా నరసింహప్ప,మండల ప్రధానకార్యదర్శి అశ్వర్థరెడ్డి,నిమ్మల శ్రీధర్‌రెడ్డి,మైనార్టీ కార్యదర్శి గిరిధర్ తోపాటు ఉమ్మడి కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# అలరించిన సంగీత విభావరి

**పుట్టపర్తి రూరల్ జూన్ 22 ప్రభాతవార్త**



మహసమాధి చెంత సంగీత విభావరి నిర్వహిస్తున్న సాయి యువకులు

ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి ప్రశాంతినిలయానికి ప్రకాశం జిల్లా నుండి దాదాపు 1200 మంది సత్య సాయి భక్తులు విచ్చేశారు. వారి రెండు రోజుల వర్తియాత్రలో భాగంగా మొదటి రోజున ప్రకాశం జిల్లాకు చెందిన సాయి యువకులు సంగీత విభావరి కార్యక్రమాన్ని ప్రదర్శించారు.ఈ ప్రదర్శన చూపరులను ఎంతగానో అకట్టుకుంది.అనంతరం ప్రకాశం జిల్లా సత్యసాయి సేవాసంస్థల అధ్యక్షుడు టి రామిరెడ్డి వారి సమితి ద్వారా చేస్తున్న సేవలను,వైద్య సేవలను గురించి వివరించారు.అనంతరం సాయి విద్యార్థుల భక్తి గీతాలను ఆలపించారు.ఈ ప్రదర్శన నిర్వహించాన ప్రకాశం జిల్లా యువకులకు ట్రస్ట్ వర్గాలు నూతన వస్త్రాలను బహుకరించారు.ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా సాయి భక్తులతో పాటు,సాయి విద్యార్థులు,సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

## నూతన డిజిపి ద్వారకా తిరుమల రావును కలిసిన మచ్చా రామలింగారెడ్డి

అనంతపురం, జూన్ 22 ప్రభాతవార్త బ్యూరో



డిజిపిని సన్మానిస్తున్న మచ్చా రామలింగారెడ్డి

ఆంధ్రప్రదేశ్ పోలీస్ బాస్ రాష్ట్ర డిజిపిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ద్వారకా తిరుమలరావును ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, ఏపి ఒలంపిక్ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో ఉదయం మచ్చారామలింగారెడ్డి డిజిపిని సన్మానించి మెమెంటోను అందజేశారు. మచ్చా రామలింగారెడ్డితోపాటు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు ఇతర జర్నలిస్టులు డిజిపిని కలిసిన వారిలో ఉన్నారు.

## ప్రతి ఫెయిల్యూర్‌లో ఒక గెలిచే దారి పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జూన్ 22 ప్రభాతవార్త

హిందూపురం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రముఖ రచయిత్రి మద్దూరు ప్రగతి రచించిన పుస్తకావిష్కరణ సభ అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో జరిగింది. డాక్టర్ పట్టా సాధన కోసం, ఆమె చేసిన పరిశోధన అనుభవాలను ప్రతి ఫెయిల్యూర్‌లో ఒక గెలిచె దారి అనే గ్రంథంగా రచించారు. ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీకృష్ణ దేవరాయ విద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.హుస్సేన్‌రెడ్డి ఒక పరిశోధకురాలిగా, కళాశాల ప్రిన్సిపాల్‌గా, రచయిత్రిగా ప్రగతి నిబద్ధతను కొనియాడారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఎసిఆర్.దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సైన్స్ పుస్తకాన్ని చాలా సరళమైన శైలిలో రాశారని వివరించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన మానవ హక్కుల నాయకులు ఎం.చంద్రశేఖర్ సాధారణంగా డాక్టరేట్ పట్టా పొందిన పుస్తకాలు ప్రచురణ కావడం చూస్తూ ఉంటాము, కానీ పరిశోధనలోని అనుభవాలను పుస్తకంగా ప్రచురించడం ఇదే మొదటి సారి అని అన్నారు. ప్రతి పరిశోధన సామాజిక ప్రగతి కొరకు జరుగుతుంది. పరిశోధకుల గురించి సమాజానికి పెద్దగా తెలీదు,. ఆ లోటును ఈ పుస్తకం కొంతయినా తీర్చగలదని మైక్రో బయాలజీ అధ్యాపకురాలు హెచ్.పల్లవి పుస్తకాన్ని సమీక్ష చేశారు. ప్రముఖ వైద్యులు గేయానంద్ మాట్లాడుతూ.. సైన్స్ పరిశోధనల ద్వారా జరిగే అభివృద్ధిని వివరించారు. కార్యమంలో అధ్యాపకులు సుధామ వంశీ, ఉషారాణి, శివరాం, ఆచార్య వెంకట రమణ, విద్యార్థులు సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

## ఆరవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల



ఆరవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జూన్ 22 ప్రభాతవార్త

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవర సెమిస్టర్ ఫలితాలను ఎస్కె యూనివర్సిటీ ఉపకులపతి హుస్సేన్ రెడ్డి శనివారం విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్కె యూనివర్సిటీ ఎగ్జామ్స్ డీన్ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ లోకేష్, కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ చలపతి, విభాగాధిపతులు ఇతర అధికారులు పాల్గొన్నారు. పరీక్షల ఫలితాల్లో ఆర్ట్స్‌లో 94 శాతం, కామర్స్‌లో 99 శాతం, సైన్స్‌లో 98 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అలాగే రెండవ, నాల్గవ, ఆరవ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలను కూడా విడుదల చేయడం జరిగింది. కార్యక్రమంలో పరీక్షల విభాగం అధికారులు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## 117 జీవో రద్దు చేయండి

- ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్‌భాస్కర్



అనంతపురం న్యూటౌన్, జూన్ 22 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్‌లో విద్యా వ్యవస్థ బాగుపడాలంటే పాఠశాలల విలీనానికి కారణం అయిన 117 జీవో కచ్చితంగా రద్దు కావాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోషియేషన్‌రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయభాస్కర్ అన్నారు. గత ప్రభుత్వంలో అనాలోచితంగా విడుదల చేసిన 117 జీవో వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులు, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 6, 7, 8 తరగతులు ఉన్నత పాఠశాలల్లో విలీనం కావడం వల్ల విద్యార్థులు కాలినడకతో ఉన్నత పాఠశాలలకు వెళ్లలేక బడి మానేయడం జరిగిందని అన్నారు. పాఠశాల విలీనంతో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు వేల సంఖ్యలో రద్దు కావడం వల్ల డిఎస్సీలో టీచర్ పోస్టులు తగ్గాయని అన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా వేల సంఖ్యలో పాఠశాలలకు ఎన్నో మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాత ఆ పాఠశాలలను విలీనం చేయడం వల్ల తరగతి గదులు నిరుపయోగంగా మారాయని అన్నారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా 117 జీవోను రద్దు చేసి విద్యా వ్యవస్థను గాడిలో పెడతానని మాట ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో విద్యావస్థ కుటుం పడడానికి కారణం అయిన 117 జీవోను వెంటనే రద్దు చేసి విలీనం అయిన పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు.

## శ్రేష్ట ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

అనంతపురం న్యూటౌన్, జూన్ 22 ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 9, 11 తరగతుల విద్యార్థులకు దేశంలో ఎంపిక చేసిన కార్పోరేట్ సిబిఎస్ఈ పాఠశాలల్లో పూర్తి ఉచిత రెసిడెన్షియల్ విద్య, వసతి కల్పించేందుకు ఉద్దేశించిన దేశ వ్యాప్త శ్రేష్ట ప్రవేశ పరీక్షలో అనంతపురం, సత్యసాయి జిల్లాలోని అంబేద్కర్ గురుకులం/ ఎపిఎస్‌డబ్ల్యూఆర్ గురుకుల 9, 11 తరగతుల విద్యార్థులు 80 మంది ఉత్తీర్ణులయ్యారని, అందులో 30 మందికి 3వేలలోపు ర్యాంకు వచ్చి ఎంపిక అయ్యే అవకాశం ఉన్నట్లు తెలపడానికి సంతోషిస్తున్నామని డిసిఓ ఏ.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

## సెలవుపై వెళ్ళిన బీసీ వేల్ఫేర్ డీడీ

అనంతపురం న్యూటౌన్, జూన్ 22 ప్రభాతవార్త

బీసీ వేల్ఫేర్ డీడీ ఖుష్బూ కొఠారి శనివారం నుంచి వారం రోజులు పాటు వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లారు. ఆమె తిరిగి వచ్చేంత వరకు ఇన్‌ఛార్జ్ డీడీ బాధ్యతలను ఎస్సీ వేల్ఫేర్ జేడీ మధుసూధన్‌రావుకు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు శుభాకాంక్షల వెల్లువ



ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను కలిసిన జనసేన నాయకులు

అనంతపురం ఓల్డ్‌టౌన్, జూన్ 22 ప్రభాతవార్త

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, అటవీ, గ్రామీణాభివృద్ధి, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి, జనసేన అధ్యక్షులు, పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కళ్యాణ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. అనంతపురం జనసేన జిల్లా అధ్యక్షులు, అర్బన్ నియోజకర్గం ఇన్‌చార్జ్ టిసి వరుణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డిలు ఆయనను విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టిసి వరుణ్, చిలకం మధుసూదన్‌రెడ్డిలను మంత్రి పవన్‌కళ్యాణ్ ఆప్యాయంగా పలకరించి అనంతపురం జిల్లా సమస్యల గురించి ఆరా తీశారు. అనంతపురం జిల్లాలో జనసేన పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని వారికి సూచించారు.

## మలేరియా మాసోత్సవాలు



హాస్టల్ ల్లో దోమల మందును పిచికారిచేస్తున్న సిబ్బంది

బుక్కరాయసముద్రం జూన్ 22 ప్రభాతవార్త

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోదుకుమార్,మలేరియా అదికారుల ఆదేశాలమేరకు శనివారం బుక్కరాయసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిదిలోని అన్ని ప్రభుత్వ రెసిడెన్షియల్,హాస్టల్ ల్లో మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య,సిహెచ్చ్ఓ మోహన్‌రావు ఆధ్వర్యంలో ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రేయింగ్ ద్వారా (ఐఆర్ఎస్) మలాథియన్ డబ్ల్యూ డిపి 25% మందును స్ప్రే చేయించడం జరిగిందన్నారు.ఈ మలాథియన్ స్ప్రే చేయడం వల్ల దోమలు వృద్ది చెందకుండా అరికట్టవచ్చనన్నారు.అనంతరం సబ్ యూనిట్ అధికారులు మాట్లడుతూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి దోమలు వృద్ది చెందకుండా హాస్టల్ చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా,డెంగ్యూ తదితిర విషజ్వరాలు దోమకాటుద్వారా అనే వ్యాపిస్తాయని వాటిని లార్వా దశలోనే వాటిని అరికట్టడంవల్ల వ్యాధులను ప్రబలకుండా ఉంటాయన్నారు.హాస్టల్స్ లో తాగే మంచినీటి వనరులను ఎప్పటికపుడు వాటర్ టెస్టింగ్ చేయడం ద్వారా డయేరియా, టైఫాయిడ్, కలరా, పచ్చకామెర్లను నివారించవచ్చనన్నారు.హాస్టల్లో ఉన్న విద్యార్థులకు జ్వరం వచ్చినట్టయితే సంబందిత వైద్యసిబ్బందికి తెలియజేసి రక్తపరీక్షలు చేయించి మందులను పంపిణీచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వారితోపాటు పిహెచ్చ ఎన్ చెన్నమ్మ,సబ్ యూనిట్ సూపర్వైజర్లు శ్రీధర్‌మూర్తి, నూర్‌భాషా, పీహెచ్చీ సూపర్వైజర్ జానీరాజ్,హెల్త్ అసిసెంట్లు ధనుంజయ, ఆనంద్,హాస్టల్ వార్డెన్ల్ తదితిరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు ఏపీవోపై విచారణ చేసిన అధికారులు

- అనధికారికంగా 64 ఓడిలు పెట్టినట్లు వెలుగులోకి

అనంతపురం న్యూటౌన్, జూన్ 22 ప్రభాతవార్త

సమగ్రశిక్షలో ఏపీవోగా పనిచేస్తున్న జె.నారాయణస్వామి గత డీఈవో హాయంలో విధులకు డుమ్మా కొట్టడం, దళిత ఉద్యోగులను హేళన చేస్తూ, అవమాన పరచడం, అధికారిక వాట్సాఫ్ గ్రూపులను తన స్వంత ప్రయోజనాలకు వినియోగించడం, సీసీఏ రూల్స్‌కు విరుద్దంగా చీటీలు, చీట్స్‌ను నడవతున్నారనే ఆరోపణలు చేస్తూ ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డా.హెచ్.రామచంద్ర, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు యల్లన్న గత నెల డీఈవోకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఇందుకు డీఈవో స్పందించి విచారణకు ఆదేశిస్తూ....విచారణ అధికారులకుగా డీఈవో ఆఫీసు ఏడీ క్రిష్ణయ్య, సూపరింటెండెంట్ ఆదినారాయణలను నియామిస్తూ గత నెల 29న ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ అధికారులు విచారణను ఆలస్యం చేయడం పైన ఏపీవోపై విచారణ చేయడంలో నిర్లక్ష్యం అనే శీర్షికతో ఈనెల 21న వార్త దినపత్రికలో కథనం ప్రచురితం అయింది. ఇందుకు డీఈవో స్పందించి వెంటనే విచారణ చేసి నివేదిక అందజేయాలని విచారణ అధికారులను ఆదేశించారు. దీంతో విచారణ అధికారులు శనివారం సమగ్రశిక్ష కార్యాలయానికి వెళ్ళి ఏపీవో మీద విచారణ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు అందరికీ క్వశ్చనర్ ఇచ్చి రాయించుకున్నారు. అలాగే ఫిర్యాదు దారులను కూడా పిలిపించి వారితో కూడా రాయించుకున్నారు. విచారణ అధికారులు ఏపీవో అటెండెన్స్ జిరాక్సు, అతని నియామక ఉత్తర్వుల జిరాక్సు వెంట తీసుకెళ్ళారు.

**అనధికారికంగా 64 ఓడిలు పెట్టిన ఏపీవో :**

ఏపీవో జె.నారాయణస్వామి గత డీఈవో హాయంలో అనధికారికంగా దాదాపు 64 ఓడిలు వినియోగించినట్లు వార్త విలేఖరి ఆర్‌టిఐ ద్వారా తీసుకున్న అటెండెన్స్‌లో వెలుగులోకి వచ్చాయి. గత ఏడాది ఫిబ్రవరిలో ఐదు ఓడిలు, మార్చిలో 17 ఓడిలు, ఏప్రిల్‌లో 13 ఏడిలు, మేలో నాలుగు, జూన్‌లో రెండు, జూలైలో నాలుగు, ఆగస్టులో నాలుగు, అక్టోబర్‌లో ఒకటి, నవంబర్‌లో ఐదు, డిసెంబర్‌లో ఆరు, ఈ ఏడాది మేలో మూడు ఓడిలు మొత్తం 64 ఓడిలను వినియోగించారు. ఓడి పెడితే అటెండెన్స్ తన సంతకం వద్ద కారణం రాయాలి. కానీ ఏ ఒక్క ఓడి దగ్గర కూడా అధికారులు ఎలాంటి కారణం రాయకపోవడం గమనార్హం. ఆ ఓడిలు ఎందుకు పెట్టారో, ఆయా నెలల్లో ఓడిలు పెట్టినప్పటికీ అప్పటి సమగ్రశిక్ష అధికారులు కళ్ళుమూసుకొని ప్రతి నెల మొత్తం జీతం మంజూరు చేయడం గమనార్హం. అయితే ఏపీవో అక్రమాలపై విచారణ చేసిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది వేచి చూడాల్సిందే.

## పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు



పెద్దమ్మతల్లికి పూజలు నిర్వహించిన దృశ్యం

యాడికి, జూన్ 22 ప్రభాతవార్త

మండల కేంద్రంలో వెలసిన పెద్దమ్మతల్లి ఆలయంలో శనివారం జేష్టమాస ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మామిడితోరణాలతో అరటిఆకులతో ఆలయ ప్రాంగణాన్ని అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, నూతన వస్త్రాలు సమర్పించి గంగా కలిశం పూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. కుంకుమార్చన, లలిత సహస్రనామావళి, భక్తి పాటలతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మికశోభను సంతరించుకుంది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పెద్దమ్మతల్లి ఆలయ అభివృద్ధి కమిటీ, భక్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

## రైతులకు ప్రోత్సాహాలు అందించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున



ఏరువాక రైతు మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం.

అనంతపురం రూరల్,జూన్22ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్‌లోని రైతులకు ప్రోత్సాహాలు అందించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైయని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున ఆరోపించారు. అనంత రూరల్ మండలం కందుకూరు గ్రామంలో జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి వ్యవసాయ సాగు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ రైతులకు ప్రోత్సాహాలు అందించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని కేవలం ఎన్నికల సమయంల చెప్పే వాగ్దానాలు అధికారం చేపట్టిన అనంతరం ఆచరణ చేయడం మాత్రం శూన్యమన్నారు.వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం రైతులకు ప్రోత్సహాలతో పాటు ఒక్కో రైతు కుటుంబానికి రూ.10వేలు ప్రతి నెల పెన్షన్ రూపంలో ఇవ్వాలన్నారు.రైతుల పనిముట్లపై జీఎస్‌టీ లేకుండామినహాయింపు ఇచ్చే విధంగా ఆదేశాలను విడుదల చేయాలన్నారు.రైతులకు ఎద్దులు,ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లను సబ్సీడీలో అందించాలన్నారు.ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం రైతులకు ఎరువులు,పురుగు మందులు,,విత్తనాలు,సూక్ష్మపోషకాలు 90 శాతం సబ్సీడితో రైతు భరోసా కేంద్రాల్లో అందించాలన్నారు.నకిలీ విత్తనాలను అరికట్టీ వాటీని అమ్మే వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పాడిపసువులకు,గొర్రెలకు,మేకలకు విరివిగా రుణాలు అందించాలన్నారు. అనంతరం వారు గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో నాగళ్ళు,మడకలు,గోఱ్ఱులు,గుంటకలతో ఏరువాక సాగు కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలోవన్నారెడ్డి,పి.రామకృష్ణ,ఎన్.రామకృష్ణ,వెంకటరాముడు,నగేష్,పుల్లారెడ్డి,శ్రీరాములు,నల్లప్ప,ఓబిలేసు,రామాంజినేయులు,శివయ్య,లింగమయ్య,బ్రహ్మయ్య,నరసింహులు,నాగేష్,రామాంజనేయులు,పుల్లమ్మ,పోలిన్న,తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాముకాటుకు గురైన చిన్నారి కనిపించని లక్షణాలు

- గుర్తించి ప్రాణాలు కాపాడిన కిమ్స్ సవేరా వైద్యులు



చిన్నారితో కిమ్స్ సవేరా వైద్యులు

అనంతపురం సిటీ, జూన్ 22 ప్రభాతవార్త

పాముకాటుకు చిన్నారి గురైన లక్షణాలు కనిపించక ప్రాణాపాయ స్థితికి చేరుకున్న చిన్నారిని కిమ్స్ సవేరా వైద్యులు చికిత్సలు అందించి ప్రాణాలు కాపాడారు. 12 ఏళ్ల బాలుడు ఊపిరి సరిగా అందక ప్రాణాపాయ స్థితిలో కిమ్స్ సవేరాకు చికిత్స నిమిత్తమై తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు ఆక్సేయల్ శాచురేషన్ 66 శాతం ఉండటం, న్యూమోనియా లక్షణాలు ఉండటం, న్యూమోనియా లక్షణాలు జలుబు, దగ్గు ఒక్కటీ లేకపోవడంతో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్సలు ప్రారంభించారు. బాలుడిపరిస్థితిపై పూర్తి స్థాయిలో ఆరాతీసిన వైద్యులకు రాత్రి సమయంలో కడుపునొప్పి, వాంతులు, గొంతు నొప్పి రావడతో స్థానికంగా వైద్యులను సంప్రదించగా పేగుల్లో సమస్య ఉన్నట్లు మందులు అందించారు. అయినప్పటికీ కొన్ని గంటల తరువాత ఊపిరి అందని పరిస్థితుల్లో కిమ్స్ సవేరాకు చికిత్స నిమిత్తమై తీసుకొచ్చారు. వారి కుటుంబీకులు వైద్యులకు వివరించారు. అన్ని పరీక్షలు నిర్వహించిన కిమ్స్ సవేరా వైద్యులు బాలుడు పాముకాటుకు గురైనట్లు గుర్తించి అందుకు అవసరమైన వైద్య సేవలు అందించి బాలుడిని కాపాడారు. సహజంగా పాముకాటుకు గు రైతే నోటివెంట నురుగు రావడం, నరాలు చచ్చుబడి పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని, ఇలాంటి లక్షణాలు బాలుడిలో లేకున్నా కిమ్స్ సవేరా వైద్యులు గుర్తించి చికిత్సలు అందించి బాలుడి ప్రాణాలు కాపాడారు. ఈ సందర్భంగా కిమ్స్ సవేరా పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మహేష్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు ఎవరైనా కింద పడుకుని తీవ్రమైన కడపునొప్పితో బాధపడుతూ, ఇతరాత్ర సమస్యలు మొదలైతే పాముకాటుగా అనుమానించాలని వెంటనే తగిన చికిత్సలు అందించాలని లేదంటే ఆలస్యమైతే పరిస్థితి విషమిస్తుందని తల్లిదండ్రులు ఈ విషయాలను గుర్తించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పాముకాటు లక్షణాలు లేకున్నా పూర్తి స్థాయిలో పరీక్షలు నిర్వహించి సమస్యను గుర్తించి తమ కుమారున్ని కాపాడిన వైద్యులకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రత్యేక అలంకరణలో శ్రీరంగనాథుడు

తాడిపత్రిరూరల్, జూన్ 22 ప్రభాతవార్త

మండలంలోని ఆలూరు కోనలో వెలసిన శ్రీరంగ నాథ స్వామి శనివారం



ప్రత్యేక అలంకరణలో భక్తు లకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి అర్చ కులు అభిషేకాలు, అర్చనలు, ఆకుపూజలు, తది తర పూజా కార్యక్రమాలం నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామిని వివిధ రకాల పుష్పాలు, తులసి దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా కోనలో వెలసిన శ్రీఆంజనేయస్వామి, శ్రీషిరిడిసాయిబాబా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. పెద్దఎత్తున భక్తులు కోనకు తరలివచ్చి శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీరంగనాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు జలపాతాల్లో స్నానాలు చేసి స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. అనంతరం హాజరైన భక్తులు నిత్య అన్నదాన సత్రంలో భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆలూరు రామచంద్రారెడ్డి, ఆలయ సిబ్బంది కాశీం పాల్గొన్నారు.

## యాడికిలో ఘనంగా ఉరుసు మహోత్సవం

యాడికి, జూన్ 22 ప్రభాతవార్త



స్వామివారి గంధమును ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం

మండల కేంద్రంలో శనివారం హజ్రత్ సయ్యద్ ముస్తఫా షా ఖాద్రి రహమతుల్లా స్వామి వారి ఉరుసు మహోత్సవం భక్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 20వతేదీన స్వామివారి జెండా ప్రతిష్ఠ కార్యక్రమం, 21న హుసేని ఆలం మకాణం నుండి రాత్రి గంధం ఫకీరుల జల్సాలతో దర్గా చేరి స్వామివారికి వంశీయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. 22వతేదీన ఉరుసు దీపారాధనలు రాత్రి 7 గంటలకు ఘనంగా నిర్వహించారు. 23వతేదీన ఆదివారం స్వామివారి జియారత్ ఫాతిహా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమం దర్గా సహాయకర్తలు నిర్వహించినట్లు షెక్షావలి పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే పరిటాల సునీతకు శుభాకాంక్షలు తెలిపిన అధికారులు



ఎమ్మెల్యే పరిటాల సునీతకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

అనంతపురం రూరల్,జూన్22ప్రభాతవార్త:

రాప్తాడు నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యేగా విజయం సాధించిన పరిటాల సునీతను పార్టీ కార్యాలయంలో రూరల్ మండల పరిషత్ అధికారి వై.పుల్లయ్య, పంచాయితీ కార్యదర్శులుముత్యాలరెడ్డి, అశోక్‌బాబు, మహేశ్వరరెడ్డి, హిదయతుల్లా,ప్రేమ్‌కుమార్,మహమ్మద్‌రఫి,సర్దార్‌వలి,నరసింహారెడ్డి,మల్లికార్జునరెడ్డిలు మర్యాదపూర్వకంగా కలసి ఆమెకు పుష్పగుచ్ఛాం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పరిటాల సునీత గెలుపొందడంతోఆమె మండల పరిషత్ అధికారులు అందరం కలసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందన్నారు.

## 24న జరిగే బైక్ ర్యాలీని విజయవంతం చేయండి

- ఎంఆర్‌పిఎస్ రాయలసీమ జిల్లా అధ్యక్షులు రమణ.



రమణ

అనంతపురం రూరల్,జూన్22ప్రభాతవార్త:

అనంత జిల్లాలో ఉన్న ప్రైవేట్ కార్పోరేట్ విద్యా వ్యవస్థల్లో ఒకటీ శ్రీ చైతన్య విద్యాసంస్థలో ప్రభుత్వ నిబ ంధనలను తుంగలో తోక్కి వారు ఇష్టారాజ్యంగా పుస్తకాల పేరుతోను,అడ్మిషన్ల పేరుతోను విద్యార్థుల తల్లిదండ్రులతో అక్రమంగా వసూళ్లకు పాల్పడం జరుగుతుందని వీటీని అరికట్టలని రోరుతూ ఈ నెల 24న సోమవారం అనంతలో ఏపి ఎంఆర్‌పిఎస్,విద్యార్థి యువజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయడం జరుగుతుందని కావున జిల్లాలోని ఏపి ఎంఆర్‌పిఎస్ నాయకులు,విద్యార్థి సంఘాలు,అనుబంద సంఘాలు పాల్గొన్ని ఈ బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ రాయలసీమ జిల్లా అధ్యక్షులు యు.రమణ పిలుపునిచ్చారు.

## అక్కంపల్లి అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేయాలి

- ఎన్ఆర్ కాలనీ మసీద్ హజరత్ మౌలానా నజీర్ అహమ్మద్, ముస్లీం మైనార్టీ నాయకులు.



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లీం మైనార్టీ నాయకులు

అనంతపురం రూరల్,జూన్22ప్రభాతవార్త

అనంత రూరల్ మండలం అక్కంపల్లి పంచాయితీ అభివృద్ధికి రాప్తాదు ఎమ్మెల్యే పరిటాల సునీత కృషి చేసి పంచాయితీని అన్ని విధాలుగా ముందుకు తీసుకపోవాలని ఎన్ఆర్ కాలనీ మసీద్ హజరత్ మౌలానా నజీర్ అహమ్మద్, ముస్లీం మైనార్టీ నాయకులు కోరారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రిగా పవన్‌కళ్యాణ్,మంత్రిగా నారా లోకేష్, రాప్తాడు ఎమ్మెల్యేగా పరిటాల సునీత ప్రమాణస్వీకారం చేసిన సందర్భాగా అనంత రూరల్ మండలం ఎన్ఆర్ కాలనీలోని ఎన్ఆర్ కాలనీ మసీద్ హజరత్ మౌలానా నజీర్ హ్మమ్మద్, ముస్లీం మైనార్టీ నాయకులు మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనాలు చేసి వీరి సమక్షంలో రాష్ట్రంలో అభివృద్ది బాటలో ముందుకు సాగాలని అల్లాన్ ప్రార్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపి సిఎంగా నారా చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్,మంత్రిగా నారా లోకేష్, రాప్తాడు ఎమ్మెల్యేగా పరిటాల సునీత ప్రమాణస్వీకారం చేయడం రాష్ట్రంలోని టిడిపి,జనసేన నాయకులు ఎంతో సంతోషం వ్యక్తం చేయడంతో పాటు సంబరాలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. గత ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో రాష్ట్రంలోని ప్రజలందరు అనేక ఇబ్బందులు ఎదుర్కోనడం జరిగిందని మొన్న జరిగిన ఎన్నికల్లో ప్రజలందరు ఆ రాక్షస పాలనకు చమరగీతం పాడి ప్రజల సంక్షేమ ప్రభుత్వం ఏర్పాడంతో ప్రజలందరు సంతోషంను వ్యక్తం చేయడం జరుగుతుందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో గతంలో టిడిపి అధికారంలో ఉన్న సమయంలో పరిటాల సునీత మంత్రిగా ఉన్నప్పుడు అభివృద్ది జరిగిందని తప్ప వైసిపి ప్రభుత్వం ఏర్పాటు అయి ఎమ్మెల్యేగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గెలుపొందినప్పటీ నుంచి ఐదు సంవత్సరాలు ఆయన అభివృద్దిని గాలికి వదిలేసి వారి కుటుంబాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవడం జరిగిందన్నారు. కాని పరిటాల కుటుంబం అంటే అభివృద్ధి,అభివృద్ధి అంటే పరిటాల కుటుంబమేన్నారు. గతంలో ఎప్పుడు అనంత రూరల్ మండలం అక్కంపల్లి పంచాయితీలో టిడిపికి మెజార్టీ రాలేదని కాని ఈ ఎన్నికల్లో టిడిపికి 500 పైనా మెజార్టీ రావడం జరిగిందని ఇంత మెజార్టీ ఇచ్చిన పంచాయితీ అభివృద్ధికి ఎమ్మెల్యే పరిటాల సునీత కృషి చేయాలని వారు కోరారు. చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్‌లు కేంద్ర ప్రభుత్వం సహాయ సహ కారంతో రాష్ట్రాన్ని అభివృద్ది బాటలో ముందుకు తీసుకుపోడం జరుగుతుందన్నారు. ఆదే విధంగా రాప్తాడులో ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రజా సంక్షేమం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లీం,మైనార్టీ నాయకులు చాంద్‌భాషా, నూర్‌మహ్మమద్, హుసేన్‌సాబ్,వన్నూర్ సాహెబ్ పాల్గొన్నారు.

## ఎస్సీ హాస్టల్ వార్డెన్లకు మెమోలు జారీ

అనంతపురం న్యూటౌన్, జూన్ 22 ప్రభాతవార్త

వార్త ప్రభావం

విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తూ శుక్రవారం ఉదయం 6 గంటలకు పెషియల్ యాప్‌లో అటెండెన్స్ వేయకపోవడంపై పేషియల్ యాప్‌లో అటెండెన్స్ వేయని 23 మంది వార్డెన్లు అనే శీర్షికతో ఈనెల 22న వార్త దినపత్రికలో కథనం ప్రచురితం అయింది. ఇందుకు శ్రీ సత్యసాయి జిల్లా ఎస్సీ వేల్ఫేర్ జిల్లా అధికారి శివరంగ ప్రసాద్ స్పందించి తన పరిధిలోని 13 మంది ఎస్సీ హాస్టల్ వార్డెన్లకు మెమోలు జారీ చేసి అందరి వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. యాప్‌లో అటెండెన్స్ వేయకపోవడానికి కారణాలు రాయించుకోవడం జరిగింది. తమ తప్పులను కప్పి పుచ్చుకోవడానికి పలువురు వార్డెన్లు ప్రయ త్నించినప్పటికీ జిల్లా అధికారి వాటిని పరిగణలోకి తీసుకోలేదు. ప్రతి వార్డెన్, వర్కర్ నిబంధనల ప్రకారంగా సమయానికి పెషియల్ యాప్‌లో, బయో మెట్రిక్‌లో తప్పనిసరిగా అటెండెన్స్ వేయాలని ఆదేశించారు. అడ్మిషన్లు పెంచాలని, మెనూ పాటించాలని ఆదేశించారు. అదే విధంగా అనంతపురం జిల్లాలో యాప్‌లో బయోమెట్రిక్ వేయని పది మంది ఎస్సీ హాస్టల్స్ వార్డెన్లపై కూడా చర్యలు తీసుకుంటామని జేడీ మదుసూధన్‌రావు వార్తకు తెలిపారు.

## మైనార్టీ హాస్టల్‌లో వసతి కోసం దరఖాస్తులు ఆహ్వానం

అనంతపురం న్యూటౌన్, జూన్ 22 ప్రభాతవార్త

మైనార్టీ సంక్షేమశాఖ వసతి గృహంలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఉన్న ఖాళీలను భర్తీ చేయడం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమశాఖ అసిస్టెంట్‌డైరెక్టర్ జి.రామసుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ వసతి గృహంలో ఇంటర్, పాలిటెక్నిక్, డిగ్రీ చదువుతున్న మైనార్టీ విద్యార్థులు అర్హులన్నారు. అనంతపురానికి ఐదు కిలోమీటర్ల దూరంలో నుంచి వచ్చి చదువుతున్న విద్యార్థులు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులు, కలిగి ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9666955006లో సంప్రదించాలని సూచించారు.

04ATP13_04ATP13.qxd 22-06-2024 PM 10:02 Page 1



# పుట్టపర్తి అభివృద్ధికి సహకరించండి

## -మంత్రును కోరిన పల్లె సంధూరరెడ్డి



మంత్రి నిమ్మల రామానాయుడుని కలిసిన పల్లె సింధూర,రఘునాధ్‌రెడ్డి

**పుట్టపర్తి టౌన్ 22 ప్రభాతవార్త**

పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి తగిన నిధులు కేటాయించి సహకరించాలని శాసనసభ సభ్యురాలు పల్లె సింధూరరెడ్డి రాష్ట్ర మంత్రులను కోరారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో సింధూరరెడ్డి తో పాటు మాజి మంత్రి పల్లె రఘునాధ్‌రెడ్డి మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి మహమ్మద్ ఫరూక్ ను కలిసి పుట్టపర్తిలో 90 శాతం పూర్తి అయిన షాదీ మహల్‌ను గత ప్రభుత్వం పట్టించుకోలేదని తగిన నిధులుకేటాయించి పూర్తి చేయాలని సింధూరరెడ్డి కోరగా సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలో షాదీ మహల్ను పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం స్పీకర్గా ఎన్నికైన అయ్యన్న పాత్రుడికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, చేనేత శాఖమంత్రి సవితమ్మ, జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడును, ఆర్ అండ్ బి శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ను కలిశారు. పుట్టపర్తి జిల్లా కేంద్రంగా ఉన్నప్పటికి మౌలిక సదుపాయాలని కొరారు. చిన్న వయసులోనే ఎమ్మెల్యే అయిన సింధూరను పలువురు మంత్రులు అభినందించారు.

**-అసెంబ్లీలో అడుగు పెట్టడం మధురానుభూతి - సింధూరరెడ్డి**

పుట్టపర్తి మొదటి మహిళా ఎమ్మెల్యేగా ఎన్నికై తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టడం మధురానుభూతి పొందానని పల్లె సంధూరరెడ్డి, పేర్కొన్నారు. నన్ను గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని వారి ఆశయాలను మరియు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నాకు అన్ని విధాల తన భర్త అయిన వెంకట కృష్ణకిషోర్‌రెడ్డి, మామయ్య మాజి మంత్రి పల్లె రఘునాద్‌రెడ్డి సహాయ సహకారాలతో పుట్టపర్తి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

# బోడిగానిదొడ్డి గ్రామస్తులకు నష్టపరిహారం ఇవ్వాలి

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

**అనంతపురం కలెక్టరేట్, జూన్ 22 ప్రభాతవార్త**

జాతీయ రహదారి 544-డికి సంబంధించి ఎన్‌హెచ్ఏఐ చట్టం ప్రకారం బోడిగానిదొడ్డి గ్రామస్తులకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం అనంతపురం కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ చాంబర్‌లో జాతీయ రహదారి 544-డికి సంబంధించి బుక్కరాయసముద్రం మండలం బోడిగానిదొడ్డి గ్రామంలో భూ నష్టపరిహారం పంపిణీపై ఆర్బిట్రేషన్ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బోడిగానిదొడ్డి గ్రామంలోని



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

సర్వేనెంబర్ 112-2లో 0.60 ఎకరాల భూమికి అవార్డు అయ్యాక నష్టపరిహారం అందించలేదని గ్రామానికి చెందిన పట్టాదారులకు నష్టపరిహారం చెల్లించేందుకు ఈ రోజు సమావేశాన్ని నిర్వహించామన్నారు. గ్రామానికి చెందిన భూమి , ఇళ్లు కోల్పోయిన పట్టాదారులతో మాట్లాడి వారికి ఏం కావాలో తెలుసుకుని ఎన్‌హెచ్ఏఐ పిడి, ఆర్డీఒ, తహశీల్దార్‌లతో చర్చించి ఎన్‌హెచ్ఏఐ చట్ట ప్రకారం వారికి నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎన్‌హెచ్ఏఐ పిడి తరుణ్‌కుమార్, అనంతపురం ఆర్డీఒ జి.వెంకటేష్, బుక్కరాయసముద్రం తహశీల్దార్, శింగనమల సబ్ రిజిస్ట్రార్, బోడిగానిదొడ్డి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నారా లోకేష్ విద్య, ఐటి శాఖలకు వన్నెతెస్తారు

## - ధర్మవరం టిడిపి ఇన్‌చార్జ్ - లోకేష్‌కు సన్మానం చేసే ప్రయత్నం చేయగా.. యానే తిరిగి పరిటాల శ్రీరామ్‌కు సన్మానం

**అనంతపురం, జూన్ 22 ప్రభాతవార్త బ్యూరో**

మంత్రి నారాలోకేష్‌కు కేటాయించిన విద్య, ఐటి, ఎలక్ట్రానిక్ , ఆర్‌టిజీ శాఖలకు వన్నె తెచ్చే విధంగా ఆయన పని చేస్తారని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. మంగళగిరిలోని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రి నారా లోకేష్‌ని కలిశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో లోకేష్‌కు సన్మానం చేసేందుకు పరిటాల శ్రీరామ్ శాలువా కప్పేందుకు ప్రయత్నించగా, లోకేష్ తిరిగి పరిటాల శ్రీరామ్ కే శాలువ కప్పి సన్మానించారు. అనంతరం రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలకు



పరిటాల శ్రీరామ్‌ను సన్మానిస్తున్న నారా లోకేష్

సంబంధించిన పలు అంశాల గురించి చర్చించారు. రెండు నియోజకవర్గాల్లో మంచి మెజార్టీ రావడంపై లోకేష్ అభినందించారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ మాట్లాడుతూ.. గత టిడిపి హయాంలో నారా లోకేష్ మంత్రిగా పనిచేస్తున్నప్పుడు రాష్ట్రానికి అనేక పరిశ్రమలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం కీలకమైన విద్య ఐటి శాఖలు నారా లోకేష్‌కు అప్పగించడం శుభ పరిణామం అన్నారు. ఆయన విద్య, ఐటి శాఖలో కీలక మార్పులు తీసుకొస్తారని, కచ్చితంగా యువత సమర్ధవంతంగా ముందుకు తీసుకొస్తారని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ లోకేష్ ఆధ్వర్యంలో న్యాయం జరుగుతుందని శ్రీరామ్ అన్నారు.

# భవిష్యత్తులో ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలి

## - జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి




యాప్ ను ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి.

**గోరంట్ల జూన్ 22 ప్రభాతవార్త**

ప్రతి విద్యార్థి బాగా చదవాలని కష్టపడి ఇష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలకు చేరవచ్చునని ఒక లక్ష్యంతో ముందుకు వెళ్లాలని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి తెలిపారు. అలాగే ఎంత ఎదిగిన ఒదిగి ఉండాలని అప్పుడే క్రమశిక్షణతో కూడిన జీవితం సాగుతుందన్నిరు. ఈ సందర్భంగా గోరంట్ల పట్టణంలోని జిల్ల పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గోపాల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమం లో భాగంగా ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి గంధం ధీరజ్ తన జన్మదినం సందర్భంగా ఆవిష్కరించిలనే ఉద్దేశ్యంతో గత 4 నెలల నుండి రోజుకు సుమారు 3 నుండి 4 గంటల సేపు శ్రమించి రాష్ట్రంలోని నతన తోటి విద్యార్థులతో పాటు పోటీ పరీక్షలకు ప్రిపేర్ లయ్యే వారికోసం తను నేర్చుకున్నకోడింగ్ ద్వారా ప్రమాణాలతో ఇంటెలిజెన్స్ సహాయంతో అత్యున్నత ప్రమాణాలతో సాంకేతిక అంశాలను జోడించి ఎంతో ప్రొఫెషనల్ గా లెర్న్ ఈజీ అనే ఎడ్యుకేషనల్ యాప్‌ను తయారు చేసిన ఈ యాప్ గురించి జిల్లా విద్యాశాఖాధికారిణి మీనాక్షి దృష్టికి తీసుకెళ్లడంతో స్వయంగా డీఈఓ మీనాక్షి పాఠశాలకు వచ్చి ధీరజ్‌ను ప్రత్యేకంగా అభినందించి ఈ యాప్‌ను డిఈఓ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు యస్ గోపాల్ గోరంట్ల మండల విద్యాధికారులు 1 రెడ్డెప్ప, 2 గోపాల్ ఏవో ప్రకాష్‌రెడ్డి, గంధం శ్రీధర్ దామోదర్ రెడ్డి పాఠశాల అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# శింగనమల ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు



ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి పుష్పగుచ్ఛం అందచేస్తున్న నాయకుడు రమణారెడ్డి



తిరుమలాపురం టిడిపి నాయకులు శ్రీనివాసులురెడ్డి

**యల్లనూరు, జూన్ 22 ప్రభాతవార్త**

శింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొంది, శాసనసభలో ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి తిరుమలాపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు శ్రీనివాసులరెడ్డి, రమణారెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన పదవులు అలంకరించాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో వుంటూ ప్రజాసేవ చేయాలని వారు కోరారు.

# ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

**యల్లనూరు, జూన్ 22 ప్రభాతవార్త**

శింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించి, ఎమ్మెల్యేగా శాసనసభలో ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి యల్లనూరు మండల టిడిపి కన్వీనర్ దొడ్లో రామాంజినేయులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండారు శ్రావణిశ్రీ భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన పదవులు అలంకరించాలని ఆయన ఆకాంక్షించారు.



టిడిపి మండల కన్వీనర్ దొడ్లో రామాంజినేయులు

# నేడు విద్యుత్ అంతరాయం

**ధర్మవరం రూరల్, జూన్ 22 ప్రభాతవార్త**

పట్టణంలోని చెన్నకేశవపురం సబ్ స్టేషన్‌లో విద్యుత్ మరమ్మత్తులు చేయుచున్న కారణంతో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రియాంక నగర్, ఆర్టిసి బస్టాండ్, సిద్దయ్యగుట్ట, నెహ్రూ నగర్, బడే సబ్ వీధి, ఎస్‌బిఐ కాలనీ, అంజన్ సర్కిల్, మార్కెట్ స్ట్రీట్, కళాజ్యోతి సర్కిల్, మాధవనగర్, డివన్ సెక్షన్‌లో ఉన్న ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగభూషణ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించగలరని ఆయన కోరారు.

# బడికి పోదాంపై ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ చంద్రశేఖర్‌నాయుడు

**అగళి, జూన్ 22 ప్రభాతవార్త**

బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని, బడికి పోదాం అనే కార్యక్రమాన్ని మండల విద్యాధికారి చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు. మండల పరిధిలోని పూలపల్లి, అనుమనపల్లి గ్రామాల్లో బడి ఈడు పిల్లలందరూ బడికి పోదాం కార్యక్రమంలో పాల్గొని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నేను బడికి పోతా ర్యాలీలో పాల్గొని ఎంఈఓ మాట్లాడారు. ప్రభుత్వం చిన్నారులకు ఉచితంగా విద్యాబోధనను అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో అందిస్తోందని తెలిపారు. మధ్యాహ్న భోజనంతోపాటు ఉచితంగా బట్టలు, పుస్తకాలను అందిస్తోందని, ఈ సౌకర్యాలను తీసుకుని పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో బాగా చదువుకోవచ్చన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పూల పల్లి గ్రామంలో హేమ అనే బాలిక ఇంత వరకు పాఠశాలకు వెళ్లలేదన్న విషయాన్ని గుర్తించి ఆ బాలికను పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు కాంతరాజు, అంజినప్ప, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా లక్ష్మీనరసింహుని ప్రాకారోత్సవం

## -భక్త జనంతో కిటకిటలాడిన పెన్నహోబిళ క్షేత్రం

**ఉరవకొండ, జూన్ 22 ప్రభాతవార్త**



శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహుని ప్రాకారోత్సవంలో పల్లకీ మోస్తున్న ఎస్ఐ రాఘవేంద్రప్ప

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం జేష్ఠ పౌర్ణమి శనివారం సాయంత్రం లక్ష్మీనరసింహుని ప్రాకారోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీర్చగా ప్రధానాలయం చుట్టూ ప్రదీక్షిణ నిర్వహించారు. నెల పూజోత్సవం కావడంతో జిల్లా నలుమూలల నుండే కాకుండా తెలంగాణ, కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టిబి వ్యాధి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నించిన, వృద్ధురాలు

**చెన్నేకొత్తపల్లి, జూన్ 22 ప్రభాతవార్త**

మండల పరిధిలోని, బసనేపల్లి గ్రామానికి చెందిన ఓబులమ్మ (70) వైఫ్/ఆఫ్ ఆంజినేయులు రెడ్డి, అను వృద్ధురాలు గత కొంతకాలం నుంచి తీవ్ర అనారోగ్యంతో టిబి, వ్యాధితో బాధపడుతూ మనస్థాపానికి గురై తన ఇంటిలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి ఓబులమ్మను ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వచ్చి చికిత్స చేయించారు. ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఓబులమ్మను అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఓబులమ్మకు ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు.



ఆత్మహత్యయత్నం చేసుకున్న వృద్ధురాలు

# డయాలసిస్ కేంద్రాన్ని మడకశిరలో ఏర్పాటు చేయండి

**అగళి, జూన్ 22 ప్రభాతవార్త**

డయాలసిస్ రోగులు రక్త శుద్ధి కోసం అగళి నుంచి హిందూపురం ఆసుపత్రికి వెళ్లి వస్తున్నారు. వారానికి రెండుసార్లు డయాలసిస్ చేసుకుంటేనే వారు ఆరోగ్యంగా ఉంటారు. లేని యెడల ప్రాణానికే ముప్పు. నియోజకవర్గంలో అగళి, రొళ్ల, మడకశిర, అమరాపురం, గుడిబండ మండలాలకు చెందిన రోగులు డయాలసిస్ కోసం హిందూపురం వెళ్తున్నారు. డయాలసిస్ పేషంట్లకు ఇది ఎంతో ఇబ్బందికరం. అగళి మండలం హిందూపురంకి సదూరంలో ఉంది. పూర్తిగా కర్ణాటక ప్రాంతం, ఇక్కడి నుంచి హిందూపురం ఆసుపత్రికి పోయి డయాలసిస్ చేయించుకోవడానికి సదరు రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కావున మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజుతోపాటు తె లుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి చొరవ తీసుకుని మడకశిరలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయించాలని రోగులు కోరుతున్నారు.

# పెన్నహోబిళ క్షేత్రంలో భక్తిశ్రద్ధలతో నెలపూజ మహోత్సవం

## -లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, విశేషాలంకరణ, పూజలు

**ఉరవకొండ, జూన్ 22 ప్రభాతవార్త**



లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్‌ను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

లక్ష్మీనరసింహస్వామి కొలువైన మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో స్వామివారి నెలపూజ మహోత్సవం స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం జేష్ఠ పౌర్ణమి శనివారం వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ కొనసాగింది. స్వామివారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగి ఆమిద్యాల గ్రామం నుండి శ్రీవారి ఉత్సవమూర్తులు పెన్నహోబిళం ఆలయానికి చేరిన రోజు మొదలు శనివారానికి నెలరోజులు అయిన నేపథ్యంలో జరిగే నెలపూజ మహోత్సవానికి రాష్ట్ర నలుమూలల నుండే కాకుండా తెలంగాణ, కర్నాటక నుండి కూడా భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఉదయాన్నే ఆలయానికి చేరుకున్న భక్తులు అనేక మంది స్వామివారికి తలనీలాలు సమర్పించి కొండపైన లక్ష్మీనరసింహస్వామిను, కొండ కింద ఉద్భవలక్ష్మి అమ్మవారిని, క్షేత్ర పాలకుడు ఆంజినేయస్వామిను దర్శించుకొని దాసంగాలు నిర్వహించి పలువురికి భోజనం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజాము నుండి మొదలు రాత్రి వరకు ఆలయం భక్తులతో కిటకిటలాడుతూ కనిపించింది. రద్దీ దృష్ట్య శ్రీవారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లతో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. మొక్కులు చెల్లించుకున్న భక్తులు రాత్రి ఆలయ ఆవరణం, సత్రాల్లో నిద్ర చేసే ఆనవాయితీ కొనసాగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ ఆలయం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# నాడు దాడులను ప్రోత్సహించి నేడు నీతులు చెప్పడం సిగ్గుచేటు..!

## - మాజీ ఎమ్మెల్యేకు ఆయన తనయుడి దౌర్జన్యాలు గుర్తుకురావడం లేదోమో - కార్యకర్తలను రెచ్చగొట్టి తద్వారా లబ్దిపొందాలనే ఆలోచన మానుకోండి- పయ్యావుల కుటుంబం ఏనాడూ రౌడీయిజం, ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించలేదు- విలేఖరుల సమావేశంలో మండిపడిన తెలుగుదేశం పార్టీ నాయకులు



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

**ఉరవకొండ, జూన్ 22 ప్రభాతవార్త**

నిన్నా మొన్నటి వరకు అధికార మదంతో మేము ఏం చేసినా జరుగుతుందని దాడులను ప్రోత్సహించి ఇప్పుడు మా పార్టీ నాయకులు, కార్యకర్తలపై తెలుగుదేశం పార్టీ వారు దాడులు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి నీతులు చెప్పడం సిగ్గుచేటని తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కారా ్యలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు మాదినేనిరామాంజినేయులు, జిల్లాఉపాధ్యక్షుడు రేగటి నాగరాజు, మండల కార్యదర్శి మోపిడి గోవిందు, వార్డు సభ్యుడు పి.నిరంజన్‌గౌడ్, ఇంద్రావతి మాజీ సర్పంచ్ యర్రగుంట్ల వెంకటేష్, సీనియర్ నాయకులు ప్యారం కేశవానంద తదితరులు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే తనయుడు ప్రణయ్‌రెడ్డి, పార్టీ ఇతరనాయకలు పయ్యావులకేశవ్, పయ్యావుల శ్రీనివాసులును బూతులు తిడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినపుడు ఏనాడు వారిని వారించే ప్రయత్నం చేయని ఆయన నేడు దాడులను ఎదుర్కొంటాం, మాకు బాంబులు, తుపాకులు, కేసులు కొత్తేమీ కాదని చెప్పడం బట్టి చూస్తే ఆయన వెనుక అసాంఘిక శక్తులు ఉన్నట్లు తెలుస్తోందన్నారు. పయ్యావుల కేశవ్ 1994 నుంచి రాజకీయాల్లో అడుగు పెట్టినప్పటి నుండి ఇప్పటి వరకు ఎన్నడూ దౌర ్జన్యాలు, రౌడీయిజం, గుండాయిజ ం, ఫ్యాక్షనిజంను ప్రోత్సహించలేదని తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపిస్తూ వస్తున్న ప్రజలు ప్రశాంత జీవనం గడపాలని శాంతిభద్రతలను పరిరక్షిస్తూ వస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉరవకొండలో టీడీపీ మైనార్టీ నాయకుడు కిట్టుపైన, డ్రైవర్స్ కాలనీకు చెందిన మారెన్న కొడుకులపైన దాడులు చేయించడం. సీనియర్ నాయకులు ప్యారం కేశవానందను తన గుండాలచే దారికాచి కొట్టించిన విషయాలను విశ్వేశ్వరరెడ్డి మర్చిపోయినా నియోజకవర్గ ప్రజలు మర్చిపోలేదన్నారు. చివరికి గత నెలలో పోలింగ్ రోజు కూడా తన తనయుడు ప్రణయ్‌రెడ్డి పోలింగ్ బూత్‌లవద్దకు వచ్చి రెచ్చిపోయి ఓటమి భయంతో దాడులకు దిగి రీపోలింగ్‌లు జరుగాలని శాంతిభద్రతల సమస్యలు సృష్టించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పయ్యావుల కేశవ్‌పై అపారమైన నమ్మకంతోనే ఆయన్ను 5 సార్లు నియోజకవర్గ ప్రజలు గెలిపించారని, నాలుగుసార్లు ఆయన చేతిలో ఓటమిపాలైనా విశ్వేశ్వరరెడ్డి నేటికీ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. తప్పులు చేసి పొరపాటు అయింది క్షమించమని అడిగితే మన్నించే గొప్ప గుణం పయ్యావుల శ్రీనివాసులు, పయ్యావుల కేశవ్ వద్ద ఉందని అన్నారు. తన కుమారుడి మీద మితిమీరిన ప్రేమతో నియోజకవర్గ ప్రజలఆధరాభిమానాలు కోల్పోయి ఓటమిపాలవుతూ నేడు నీతులు చెబుతున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ పి.రాజేష్, పార్టీ సీనియర్ నాయకులు బి.సి.మారెన్న, బాబు, వేల్పుల శ్రీనివాసులు, వార్డు సభ్యులు యం.రామాంజినేయులు, చేజాల ప్రభాకర్, మీనుగ రవి, వేల్పుల వాసుదేవుడు, రమేష్, వర ప్రసాద్, శంకర్ సుదర్శన్, తాజుద్దీన్, ఖాదర్‌బాషా, గమ్ ప్రభాకర్, పెద్దన్న, రామకృష్ణ, సుధాకర్, మారెన్న తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ వసతి గృహాల్లో దోమల నివారణ చర్యలు

**ఉరవకొండ, జూన్ 22 ప్రభాతవార్త**



బాలికల హాస్టల్‌లో మిలాథిన్ ద్రావణాన్ని పిచికారి చేయిస్తున్న దృశ్యం

ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో దోమల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా శనివా రం ఉరవకొం డ పట్టణం లోని జూనియర్ కళాశాల బాలికల సంక్షేమ వసతి గృహంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి మలేరియా వర్కర్లచే మిలాథిన్ డబ్ల్యూడీపీ 25శాతం ద్రావణాన్ని పిచికారి చేయించారు. ఈ సందర్భంగా భక్తుల కోదండరామిరెడ్డి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. దోమలను లార్వా దశలోనే అరికట్టడంవల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, బోధకాలు లాంటి వ్యాధుల బారిన పడకుండా చూసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచా యతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్, సంక్షేమ వసతిగృహాల వార్డెన్లు అరుణమ్మ, లక్ష్మీనారాయణమ్మ, రామలక్ష్మి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# అనుమతులులేని ఎడిసన్ పాఠశాలను సీజ్ చేయాలి

## - మండల విద్యాధికారికు ఏఐఎస్ఎఫ్ వినతి

**ఉరవకొండ, జూన్ 22 ప్రభాతవార్త**

పట్టణంలో ప్రభుత్వ గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న ఎడిసన్ ఉన్నత పాఠశాలను విద్యాశాఖ అధికారులు వెంటనే సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ ఉరవకొండ మండల అధ్యక్షుడు ఎస్.ఎస్.హారూన్ రషీద్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఈ మేరకు స్థానిక మండల వనరుల కేంద్రంలో మండల విద్యాధికారి-2 రమాదేవికు ఫెడరేషన్ ఇతర నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరూన్ రషీద్ మాట్లాడుతూ ఈ విషయమై ఇదివరకే మండల విద్యాధికారి ఈశ్వరప్పకు వినతిపత్రాలు అందించినా ఆయన స్పందించలేదన్నారు. ఎడిసన్ హైస్కూల్ యాజమన్యంతోపాటు వివిధ పాఠశాలల యాజమాన్యాలు ఎలాంటి ఫిట్‌నెస్ లేని బస్సుల్లో విద్యార్థుల రాకపోకలు నిర్వహిస్తున్నారని ఎంవీఐ అధికారులు వెంటనే స్పందించి బస్సుల ఫిట్‌నెస్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కోరారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, సాయి, మారుతి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



మండల విద్యాధికారి-2 రమాదేవికు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు